# గమ్యానికి రెండుదార్లు

"టిఫిన్ తీసుకోండి!"

"ఇప్పుడు ఇవన్నీ ఎందుకు వదినగారూ! పైగా కతికితే అతకదంటారు!"

"అనసూయమ్మగారన్నది అక్షర సత్యం! అయినా సుభద్రమ్మగారూ! అమ్మాయికి అబ్బాయీ, అబ్బాయికి అమ్మాయీ నచ్చి, ఈ పెళ్ళి జరిగిపోవాలే కానీ మీ ఇంట్లో వీరూ, వీరింట్లో తమరూ కాఫీ టిఫిన్లు పుచ్చుకొనక పోతారా? విందు భోజనాలకు పిల్చుకొనక పోతారా? ఈ తంతులన్నీ ఇప్పుడెందుగ్గానీ  అసలు తంతు కానివ్వండి!...ముందు అమ్మాయిని తీసుకురండి! మళ్ళీ షష్ఠి ఘడియలు వచ్చేస్తున్నాయి!" మధ్యవర్తిత్వం నెరపుతున్న మంగపతి హెచ్చరించేడు.

జ్యోతిని తీసుకొచ్చి, పెళ్ళికొడుకు హోదాలో ఉన్న సూర్యం ఎదురుగా కుర్చీలో కూర్చోబెట్టింది సుభద్రమ్మ.

పెళ్ళిచూపుల తంతు జయప్రదంగా ముగిసింది.

## 2

"అమ్మాయి వాళ్ళకి నచ్చిందటోయ్!"

"అలాగా! శుభం! ఉత్తరం వచ్చిందా?"

"లేదు... ఇందాక బజార్లో మంగపతి కనిపించేడు. బందరునించి పొద్దున్నే వచ్చాట్ట. రాత్రి మనింటికొచ్చి విషయం చెప్పాలని అనుకుంటూనే ఉన్నాట్ట!'

"అయితే కట్నం కానుకల విషయం మాట్లాట్టానికి మీరోసారి బందరు వెళ్ళిరాకూడదూ?'

"కట్న కానుకల విషయం కూడా మంగపతితో చూచాయగా చెప్పేరట!"

"ఎంతలో ఉన్నారో!"

"పాతికవేలయినా పలికించాలట!"

"పాతిక వేలే?"

"అక్కడితో ఆగితే ఫరవాలేదు. అలకపాన్పు మీద పదివేల స్కూటరూ, ఆడపడచులకీ, అప్పగింతలకీ మరో అయిదు వేల రొఖ్ఖం కావాలట! అక్కడికి ఆ ఖర్చు నలభై! ఆ పైన చేతిలో పదివేలైనా ఉండాలి కదా?"

"ఇప్పుడెలా మరీ ? ఉన్నపాటున ఏభైవేలు ఎక్కడ్నించి తేగలం?" ఆత్రంగా అడిగింది సుభద్రమ్మ.

"ఆలోచిద్దాం!" అన్నాడు ఆవిడ భర్త ఆంజనేయులు.

# 3

"మంగపతితో వాళ్ళకి కబురు పెట్టి పదిరోజులయింది... గుంటూరు వాళ్ళనుంచి ఉలుకూ పలుకూ లేదేమిటో?"

"అదే నేనూ ఆలోచిస్తున్నాను!"

"ఒకవేళ మనం అడిగినంతా ఇచ్చుకోలేక వూరుకున్నారేమో?"

"పోనీ ఆ మాటే ఒక ఉత్తరం ముక్క రాసి పారేస్తే ఈ పాటికి నిడదవోలు సంబంధం ఖాయం చేసుకునేవాళ్ళం కదా. ఒక్క పిసరు నలుపన్న మాటేగాని, నిడదవోలు వాళ్ళ పిల్లకేం తక్కువా? బి.ఏ. చదివింది! హార్మనీ వాయిస్తుంది...అడిగినంత కట్నం ఇచ్చేలా ఉన్నారు కూడానూ!"

"కట్నం ఇవ్వగలిగితే మాత్రం? మన సూర్యం ఒప్పుకోవద్దుటండీ? పెళ్లంటూ చేసుకుంటే గుంటూరువాళ్ళ పిల్లనే చేసుకుంటా నంటున్నాడు. నామటుకు నాకూ ఎంతో నచ్చింది. ఆ పిల్ల కళ్ళల్లో ఎంత కళ ఉందనుకున్నారూ? పేరు జ్యోతిట! అంద చందాలకు తగ్గట్టుంది పేరుకూడానూ!"

"సర్లే! నాదగ్గర అంటే అన్నావు కానీ మరెక్కడా అనకు! మనం ఇంతగా మోజుపడుతున్నామని వాళ్ళకి తెలిసిందంటే పాతికవేలు కాదు గదా పాతిక వందలు కూడా ఇవ్వం, పొమ్మంటారు!"

"డబ్బుదేముందడీ? అబ్బాయి ఆనందంగా ఉంటే మనకి చాలదూ. ఆ పైన బంగారు బొమ్మలా ఆ పిల్ల ఇంట్లో తిరుగుతుంటే మనింటికి లక్ష్మీకళ రాదుటండీ?"

"అందమైన కోడలు కావాలని మురిసిపోతున్నావే కానీ ముందు ముందు మన సంగతి ఎలాగా అని నువ్వాలోచించటంలేదు! అవతల కళ్యాణి, కనకదుర్గ రెడీగా ఉన్నారు! మంచి సంబంధాలు చూసి వాళ్ళకు పెళ్ళిళ్ళు చేయాలా, వద్దా?"

"అంటే? అబ్బాయి కొచ్చే కట్నం డబ్బుతో అమ్మాయిల పెళ్ళిళ్ళు కానిచ్చేద్దామనుకున్నారా? మీ ఉద్యోగానికీ, హోదాకీ అలాంటి కక్కుర్తి పనులుచేస్తే నలుగురూ ఇంత గడ్డి పెడతారు?"

"అలా అని, లేనిపోని డాబులకి పోతే ముందు ముందు మనం ఆ గడ్డితినే బతకాల్సి వస్తుంది. అయినా ఉద్యోగం, హోదా ఎల్లకాలం వుంటాయనుకుంటున్నావేమో? నాలుగేళ్ళలో నేను రిటైరవుతున్నాను. ఆ విషయం మరచిపోకు..."

"సరేలెండి! మీకూ మీ వాదనకూ ఒక నమస్కారం! నిడదవోలు సంబంధమే చేస్తారో నిడుబ్రోలు సంబంధమే తెస్తారో మీ ఇష్టమొచ్చినట్టు చేసుకోండి! అబ్బాయి మాత్రం ఆ గుంటూరు పిల్లని తప్ప వేరెవర్నీ చేసుకోనని ఖచ్చితంగా చెప్పేసేడు"- కొంచెం నిష్ఠూరంగా అన్నది అనసూయ. భర్తకి వడ్డనచేయటం ముగించి డైనింగ్ టేబులుమీద వున్న గిన్నెలపై మూతలు సర్దుతూ.

"తల్లీ కొడుకులిద్దరూ ఏకమయితే ఇహ నేను చెప్పేదేముందీ? మళ్ళీ మరోసారి మంగపతితో గుంటూరు వాళ్ళకి కబురు పెడతాన్లే!" భోజనం పూర్తిచేసి, వాష్ బేసిన్ వైపు నడుస్తూ అన్నాడు అనసూయ భర్త ఆనందరావు.

## 4

"ఏ సంగతీ త్వరగా చెప్పమని ఆనందరావుగారు మళ్ళీ కబురు చేసేరోయ్!.. ఆడపిల్ల వాళ్ళళ్ళ, మనకిలేని తొందర వాళ్ళకి వచ్చేసింది!"

"మీ రనేది మరీ బాగుంది. వాళ్ళకీ తొందర లేక పోవచ్చు! కానీ, ఆడపిల్లల్ని కన్నవాళ్ళు లోకంలో ఇంకా చాలా. మంది ఉంటారుగా! 'యోగ్యుడైన కుర్రాడున్నాడూ' అంటే వాళ్ళందరూ తొందర పడతారు. అందుకే మనల్ని ఏ సంగతీ త్వరగా చెప్పమంటున్నారు. మనం కాదంటే వాళ్ళు వేరే చూసుకుంటారు మరి! అయినా ఒకసారి బందరెళ్లి ఆయనతో మాట్లాడొస్తే ఏంపోతుందీ?"

"మాట్లాడచ్చు... బేరంచేస్తే అయిదారు వేలు తగ్గిస్తారు. కాదనను! అలా అయినా,

అధమపక్షం మన దగ్గర ఒక నలభై ఉండాలంటావా?"

"అంతగా అవసరమయితే అప్పుచేద్దాం! డబ్బుకోసం చూసుకొని, దీన్ని కాస్తా దాటబెట్టుకుంటే మళ్ళీ ఇంత మంచి సంబంధం రావద్దూ? అబ్బాయి రేపో మాపో అమెరికా కూడా వెడతాట్ట! ఈ లోగా ఈ శుభకార్యం కాస్తా అయిందనిపిస్తే అమ్మాయికూడా ఇంచక్కా అమెరికా వెడుతుంది!"

"ముందు అమ్మాయి వెడితే ఆ తర్వాత అమ్మాయికి పురుడుపోసే వంకన నువ్వూ విమాన మెక్కి అమెరికా వెళ్ళచ్చని ఆశపడుతున్నావ్. అంతేగా?" భార్య బుగ్గమీద చిటికేసి ఆమెను క్రీగంటచూస్తూ అన్నాడు ఆంజనేయులు.

"విమానమెక్కినా, వింతలు చూసినా, మీరు పక్కన లేకుండా జరుగుతుందేమిటీ' సుభద్రమ్మ గారాలు పోతోంటే, ట్యూబ్‌లైట్ స్విచ్ ఆఫ్‌చేసి ఆమెను దగ్గరగా తీసుకున్నాడు.

"ఏమిటిదీ? వయసొస్తున్న కొద్దీ బొత్తిగా సిగ్గులేకుండా పోతోంది. అవతల, ఎదిగిన పిల్ల ఇంట్లో ఉందనే జ్ఞానం కూడా లేదు!"– దోమతెర క్రిందికి దించేస్తూ విసుక్కుంది సుభద్రమ్మ.

## 5

"పదిరోజులుగా రావాలనే అనుకుంటున్నాను... కానీ, ఈ పనివాళ్ళున్నారు చూసేరూ మనం ఒక్క రోజు వూర్లో లేక పోయామంటే మనల్ని ముంచేస్తారు. అందుకే దగ్గరుండి పని పూర్తి చేయించి మరీ వచ్చేను!" ఆడపిల్ల తండ్రికి ఉండవలసిన వినయ విధేయతలన్నింటినీ కనపరుస్తూ అతి మర్యాదగా చెప్పాడు, ఆంజనేయులు.

"ఈ ఏడు ఏం వేశారేమిటీ?"

"ఎప్పుడూ సాధారణంగా పొగాకే వేస్తుంటాం!"

"ఏటా ఏమాత్రం పలుకుతోందో?"

"దిగుబడి బాగుంటే ఖర్చులు పోను నికరంగా పాతిక ముప్పైవేలు మిగులుతుంది!"

అంతలో కాఫీ టిఫెన్లు వచ్చేయి.

"మీకు మంగపతి అన్ని విషయాలూ చెప్పేడనుకుంటాను!" టిఫిన్ తినటం పూర్తయిన తర్వాత అసలు పాయింటు కొచ్చేడు ఆనందరావు.

"చెప్పేరనుకోండి! కానీ, కట్నం కానుకల విషయంలో మేం అంతవరకూ తూగలేం. తమరు మరో మాట చెప్పాలి!" మొహమాట పడుతూనే అన్నాడు ఆంజనేయులు.

"చెప్పటానికేముందండీ? నిడదవోలు వాళ్ళు ఏభైవేలు దాకా ముట్టచెబుతామంటున్నారు. మీకు తెలియనిదేముంది. అబ్బాయి రేపో మాపో అమెరికాలో సెటిలయిపోతాడు. అఫ్‌కోర్స్! వాడికి మీ పిల్ల నచ్చింది! కానీ మా పరిస్థితి కూడా మీరు ఆలోచించాలి కదా. సూర్యం తర్వాత ఇద్దరు ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చెయ్యాలి. నేను రిటైర్‌మెంట్‌కి దగ్గర పడ్డాను! ఇలాంటప్పుడు ఆ మాత్రం ఆశ ఉండదంటారా చెప్పండి?"

"మీరనేది నిజమే!... కానీ ఉన్నపాటున కట్నం కానుకలకు అంతఖర్చు పెట్టాలంటే నేను అప్పుల్లో మునిగి పోవాల్సి వస్తుంది. అన్నీ కలిపి ఒక ఇరవైవేలతో మీరు ఎడ్జెస్టు చేసుకోగలిగితే ఎలాగో అలా ముందు ముందు అల్లుడికి అంతో ఇంతో ముట్ట చెప్పుకుంటాను!"

రెండు నిమిషాలపాటు ఆలోచించాడు ఆనందరావు.

తన కొడుకు ఆ అమ్మాయినే చేసుకుంటానని భీష్మించుక్కూర్చున్నాడు. తన భార్య కూడా ఆ పిల్లనే కోడలుగా చేసుకోవాలని ముచ్చట పడుతోంది. పిల్ల సంగతి ఎలా ఉన్నా కనీసం ముప్ఫయ్ వేలయినా కట్నం రాబట్టుకోకపోతే, ముందు ముందు తాను ఇబ్బంది పడాల్సి వస్తుంది. కానీ, ఇరవైకి మించి అర్ధణా కూడా ఇచ్చుకోలేనని ఆంజనేయులు ఖచ్చితంగా చెప్పేసేడు ....మరిప్పుడెలా?...

రెండు నిమిషాలు అలా రకరకాలుగా ఆలోచించిన ఆనందరావ్‌కి మెరుపులాంటి ఆలోచన ఒకటి వచ్చింది. ఆ ఆలోచన ఉభయ తారకంగా కూడా ఉంటుందనే నమ్మకం అతనిలో బలపడింది.

"అయ్యా! పిల్లలు ఒకరంటే ఒకరు మోజాపడుతున్నారు. మీరు ఇరవై కంటే ఎక్కువ ఇచ్చుకోలేనని చెబుతున్నారు. కనీసం ముప్ఫయి వేలయినా లేందే ఎలాగా అని నేను ఆలోచిస్తున్నాను.. మిమ్మల్ని నొప్పించటం నా కిష్టం లేదు. అలా అని నేను ఇబ్బందుల్లో ఇరుక్కోవటం కూడా నా కిష్టం లేదు. కాబట్టి ఉభయతారకంగా ఒక పని చేద్దాం!" అన్నాడు.

"అలాగే! చెప్పండి!"

చెయ్యవలసిందేమిటో కొంచెం రహస్యంగానే చెప్పేడు ఆనందరావ్.

## 6

అయిదారు నెలలు గడిచిపోయాయి....

పొగాకు పంట చేతికొచ్చింది. పనివాళ్ళ చేత బేళ్ళు కట్టించి బేరన్లలో జాగ్రత్త చేయించేడు ఆంజనేయులు. అక్కడి నుంచి రెండు మూడు రోజుల్లో వాటిని లారీల కెక్కించి, పుగాకు కంపెనీకి పంపిస్తే డబ్బు చేతికొస్తుంది...

సరిగ్గా అప్పుడే పనివాళ్ళకీ, ఆంజనేయులకీ ఒక గొడవ వచ్చింది.

పని చేసినందుకు వాళ్ళ కివ్వవలసిన కూలి ఇచ్చేశానంటాడు ఆంజనేయులు. ఇవ్వలేదంటారు పనివాళ్ళు!

"నేను ఇచ్చేశాను. మీ దిక్కున్న చోట చెప్పుకోండి!"

"చెప్పుకోవలసిన ఖర్మ మాకేం లేదు! చేసి చూపిస్తాం!"

మాటా మాటా పెరిగింది..

"ఎందుకివ్వాలి?" అన్నాడు ఆంజనేయులు.

"ఎలా ఇవ్వరో అదీ చూస్తాం! తెల్లవారేసరికి నువ్వే మర్యాదగా మా దగ్గరకొచ్చి, మా కూలి మాకు ఇస్తావా సరేసరి. లేకపోతే నువ్వే అనుభవిస్తావు!" పనివాళ్ళకు నాయకత్వం వహించిన నాగులు హెచ్చరించాడు.

అయినా ఆంజనేయులు బెదర్లేదు.

తెల్లవారినా, ఎవరూ ఎవర్నీ కలుసుకోలేదు.

మధ్యాన్నమైంది... సాయంత్రమైంది... చీకటిపడింది... అర్ధరాత్రి అయింది...

ఆ అర్ధరాత్రి హఠాత్తుగా పుగాకు బేరన్లకి నిప్పంటుకుంది.

నాగులే ఆ పని చేయించాడని, కేసు పెట్టేడు ఆంజనేయులు.

తమకు రావలసిన డబ్బు ఇవ్వనందుకు, తానే ఆ పని చేసినట్టు ఒప్పుకున్నాడు నాగులు.

ఆర్నెల్లు జైలు శిక్ష పడింది నాగులుకి...

## 7

ఆ తర్వాత ఆర్నెల్లుకి....

సుభద్రమ్మకి అమెరికా వెళ్ళే అల్లుడు దొరికేడు.

అనసూయకి కోరుకున్న పిల్ల కోడలుగా వచ్చింది.

ఆనందరావ్‌కి ముప్పయివేల కట్నం చేతిలో పడింది.

ఆంజనేయులు కూతురు జ్యోతికీ ఆనందరావ్ కొడుకు సూర్యానికీ ఆడంబరంగా పెళ్ళి జరిగి పోయింది.

అయితే-

ఇన్సూరెన్సు కంపెనీకి మేనేజింగ్ డైరెక్టరుగా ఉన్న ఆనందరావ్ ఇచ్చిన సలహా ప్రకారం- ఆంజనేయులు తన బేరన్లను ఏభై వేలకు ఇన్సూర్‌చేయించిన విషయం గానీ, ముందుగా పుగాకు బేళ్ళను బేరన్లలో ఉంచినా, అగ్ని ప్రమాదం జరగటానికి ముందు రాత్రే వాటిని సురక్షిత ప్రదేశానికి తరలించిన విషయంగానీ, ఆంజనేయులే కావాలని నాగుల్ని ఆ పనికి వినియోగించిన సంగతి గానీ , ఆ ముగ్గురికీ తప్ప మరో మనిషికి తెలీదు. ఇక ముందు కూడా తెలియనీయకుండా ఉండేందుకు జైలు నుంచి విడుదలై వచ్చిన నాగులు చేతిలో అయిదు వేలు పెట్టేడు ఆంజనేయులు. అయినా అతని చేతిలో ఇంకా అయిదు వేలు మిగిలేయి.!

"మీరు ఇన్సూరెన్సు కంపెనీకి పెద్ద హోదాలో ఉన్నారు గనుకనే అనుకున్న పని నిర్విఘ్నంగా జరిగిపోయి ఆర్నెల్లల్లో ఏభై వేలొచ్చి పడ్డాయి. మీ కట్నం మీకు దొరికింది. నా డబ్బు నాకు మిగిలింది. మీ మేలు మరచిపోలేను!" అన్నాడు ఆంజనేయులు అప్పగింతల తంతు ముగిసిం తర్వాత...

"చూడండి బావగారూ ! మనం వెతుక్కోవాలే గానీ ప్రతి గమ్యానికీ రెండు దార్లుంటాయి. ఒకటి రాజమార్గం. రెండోది అడ్డదారి! రాజమార్గంలో వెళ్ళే అవకాశం లేనప్పుడు అడ్డ దారితొక్కక తప్పదు మరి!" అన్నాడు ఆనందరావు శ్రీకృష్ణ పరమాత్మ పోజు పెట్టి. ★

(ఆంధ్రప్రభ 20-2-80)